# కార్మిక విజయం

కార్మిక నాయకుడికి స్వాగతం ఇవ్వటానికి వందలాది కార్మికులు ప్లాట్‌ఫారం మీద నిలబడ్డారు.

రైలింకా అంత దూరాన ఉండగానే, "కార్మిక నాయకుడికీ జై" అని స్టేషను కప్పు ఎగిరేట్టు అరిచారు కార్మికులు.

ఆగే రైలు ఒకటో తరగతి పెట్టెలోనుంచి కార్మిక నాయకుడు తొంగి చూశాడు పత్రికా విలేఖరుల కోసం.

కార్మిక నాయకుడి మొహం కనిపించగానే కార్మికులకు పారవశ్యం కలిగింది. గొంతుకులు బొంగురు పొయ్యేటట్టు జయధ్వానాలు చేశారు.

నాయకుడు రైలు దిగుతుండగానే వందలాది ఆయనను చుట్టుముట్టారు. పదిపది హేను సంఘాలవారు అతని మెళ్ళో దండలు వేశారు.

ప్రెస్ కెమెరాలు మెరిశాయి. పత్రికా విలేఖరులు నాయకుణ్ణి చుట్టుముట్టారు.

"ఏం చెప్పమన్నారు" అన్నాడు నాయకుడు.

"కొల్లాయి గుడ్డల[1] పారిశ్రామికులు, పారిశ్రామిక తగాదా పరిష్కార సంఘంవారి నిర్ణయాన్ని తృణీకరించి బోనస్ ఎగగొట్టనున్న సందర్భంలో, మీరు సమ్మె చెయ్యమని కార్మికులకు సలహా ఇస్తారా ?" అని ఒక పత్రికాదూత అడిగాడు.

"ఇది చాలా క్లిష్ట సమస్య. సాత్వికంగా అన్ని మార్గాలూ చూసిగాని సమ్మె నిర్ణయం చెయ్యరాదని నా మతం. మనం మహాత్మా గాంధి సత్యా హింసలను జవదాటటమంటే కార్మికోద్యమాన్ని ఉరితీయటమే" అన్నాడు కార్మిక నాయకుడు.

"ప్రస్తుతం రష్యా వహించే అంతర్జాతీయ పాత్ర ఏమిటి ?" అని మరొక పత్రికా సేవకుడడిగాడు.

"అమెరికా తెచ్చిపెట్టటానికి జంకే మూడవ ప్రపంచ యుద్ధాన్ని జూన్ 25న కొరియాతో రష్యా ప్రారంభించిన సంగతి అందరూ పత్రికలలో చదివి కూడా ఒక్కరూ తెలుసుకోవడంలేదు" అన్నాడు కార్మిక నాయకుడు.

"కొరియా వెనక ఒక రష్యాయే ఉన్నదా, చైనా కూడా ఉన్నదా ?"

"ఇకముందు ప్రపంచమంతా విస్తరించుకునేది రష్యా, చైనా సామ్రాజ్యాలే. ఇవి ఒకసారి ఏర్పడ్డాయో, ఆ తర్వాత ప్రజలు వాటిని పడగొట్టలేరు. అందుచేత అవి ఏర్పడకముందే జాగ్రత్తపడాలి."

---

1. కొల్లాయి గుడ్డల : టోపీ గుడ్డలు.

"ఫాసిజమును గురించి కూడా ఈ మాటలే విన్నాం."

"బోల్షెవిజం[1] కంటె ఫాసిజం[2] నయం."

"రష్యాలోనూ చైనాలోనూ ఉన్నది మార్క్సు[3] చెప్పిన కమ్యూనిజం కాదా?"

"గాంధీజం చూసిన తర్వాత నాకు మార్క్సిజంలో విశ్వాసం పోయింది. అయినా మార్క్సు చెప్పిన కమ్యూనిజం కొంతవరకు బ్రిటనులోనూ అంతకన్నా బాగా అమెరికాలోనూ అమలు జరుగుతున్నది."

"ఇంతకు కొల్లాయి గుడ్డల కార్మికులు సమ్మె చెయ్యాలని ఒత్తిడి చేస్తే ఏం చేస్తారు?"

"వద్దని సలహా యిస్తాను. కాదు కూడదంటే సమ్మె నడిపిస్తాను."

* * *

పత్రికా విలేఖరులతో గోష్ఠి కాగానే కార్మిక నాయకుడు కోసం వేచివున్న యాభైవేల రూపాయల కారులో ఎక్కి ఒక కోటీశ్వరుడి ఇంటికి వెళ్ళాడు. అతని మకాం అక్కడ ఏర్పాటు చేయబడింది.

అక్కడికి కార్మిక ప్రతినిధులు వచ్చి అతన్ని చూసి, యజమానులు తమకు బోనస్ సున్నా చుట్టటం గురించీ, తమ ఇక్కట్లను గురించీ చెప్పుకున్నారు.

---

1. బోల్షెవిజం : రష్యన్ విప్లవ విజయానికి (1917) లెనిన్ నాయకత్వంలో దోహదం చేసిన బోల్షెవిక్ పార్టీ భావజాలం - రష్యన్ కార్మికవర్గ విప్లవ ధోరణి. 1903లో జరిగిన రష్యన్ డెమోక్రటిక్ లేబరు పార్టీ రెండవ కాంగ్రెసులో - బ్రసెల్స్ కాంగ్రెసులో - మెజారిటీ పక్షంగా ఎన్నికైన లెనిన్ అనుయాయులు బోల్షెవిక్కులు. రష్యన్ భాషలోని bolshinstvo అనే పదం నుంచి ఏర్పడినమాట. bolshinstvo అంటే మెజారిటీ అని అర్థం. మార్టోవ్ నాయకత్వంలోని ప్రతిపక్షాలు మెన్షెవిక్కులు. ఇది Menshinstvo నుంచి ఏర్పడినమాట. అంటే మైనారిటీ వాళ్ళు అర్థం.
2. ఫాసిజం : చూడండి అరుణోదయంలో.
3. మార్క్సు : కార్ల్‌మార్క్సు (1818-1883). "తాత్వికులు ఇంతకాలం ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించడం మాత్రమే చేశారు. అసలు చేయాల్సింది దాన్ని మార్చడం" అన్న భౌతికవాది, చరిత్రకారుడు, ఆర్థిక సిద్ధాంతవేత్త, జర్మన్ విప్లవకారుడు. ఆయన ప్రతిపాదించిన ప్రాపంచిక దృక్పథమే "మార్క్సిజం". ఎంగెల్స్ దృక్పథం ఇందులో భాగం. మార్క్సిజం లోని మూలాలు : గతితార్కిక భౌతికవాదం, చరిత్రపట్ల భౌతికవాద దృక్పథం, వర్గపోరాటం, విలువ, అదనపు విలువ, సోషలిజం, కమ్యూనిజం, ఆచరణ,సిద్ధాంత జీవధాతవనీ, సిద్ధాంతం ఆచరణకు మార్గదర్శక మనీ నమ్మి ఉపదేశించి, ఆచరించి అంతర్జాతీయ శ్రామికవర్గ ఉద్యమాలకు

నాయకుడు అంతా విని కళ్ళు తుడుచుకుని డగ్గుత్తికతో "మనం అడుగుదాం. ఎట్లా బోనస్ ఇవ్వరో, ఎందుకివ్వరో చూస్తాం. మీరేం విచారించకండి. మీ హక్కులు కాపాడటానికి నేనున్నాను. యజమానులకు ఈ రోజే కబురు పెడతాను. వాళ్ళు వచ్చి నన్ను కలుసుకుని మాట్లాడిన తర్వాత అన్నీ తేలిపోతాయి" అన్నాడు.

కార్మిక నాయకుడికి ధనిక వర్గాలలో గల పలుకుబడిని కార్మికులు ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నారు. అతను బస చేసిన యిల్లే ఆ సంగతి ఎలుగెత్తి చాటుతున్నది. వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి యజమానుల ప్రతినిధులిద్దరు కార్మిక నాయకుణ్ణి చూడవచ్చారు. మేడపైన రహస్య సమావేశం జరిగింది.

సాయంకాలం పత్రికలన్నీ కార్మిక నాయకుడు చెప్పిన మాటలనూ, ఫోటోనూ ప్రకటించాయి. "కొల్లాయి కార్మికులు సమ్మె చేయరాదు. కార్మిక నాయకుని సలహా" అని ఒక పత్రికా, "బోల్షెవిజం ఫాసిజంకన్న భయంకరమైనది. కార్మిక నాయకుని ఉద్ఘాటన" "గాంధీజం మార్క్సిజంకంటె పవిత్రమైనది. కార్మిక నాయకుని అభిభాషణ." అని ఇంకొక పత్రిక పెద్ద హెడ్‌లైన్స్‌తో వేశాయి.

"సమ్మె మాటేమిటి?" అన్నారు యజమానుల ప్రతినిధులు.

"ఇదుగో పత్రికలకు చెప్పానే, చూడండి. సమ్మె నాకు ఇష్టంలేదు" అన్నాడు కార్మిక నాయకుడు.

"ఆఁ రోజు! నువ్వు కార్మిక నాయకుడివి, నీ ధర్మం సమ్మెలు సాగించటం!" అన్నారు యజమానుల ప్రతినిధులు చిన్నబుచ్చుకున్న మొహాలతో.

"ఆ సంగతి నాకు మీరు చెప్పనక్కర్లేదు; పరిస్థితులు సమ్మె కనుకూలంగా లేవని నా అనుమానం."

"ఎందుకు లేవూ?"

"కార్మికుల్లో సమ్మె వద్దనేవాళ్ళున్నారు."

"అరే పాపం, వాళ్ళు బోనస్‌లు ముట్టక అలమటిస్తున్నారు!" అన్నారు యజమానుల మనుషులు.

"అదీకాక కొల్లాయి కార్మిక యూనియనుకు సమ్మె సాగించే డబ్బులేదు."

"దానికెంత కావాలి భాగ్యం?"

---

పునాదులు వేసిన తాత్వికుడు, వర్గపోరాట యోధుడు. కమ్యూనిస్టు ప్రణాళిక (1848), పెట్టుబడి (మూడు సంపుటాలు 1867, 1885, 1894) ఈ శతాబ్ది చరిత్రను కొత్త ప్రపంచంలోకి మలుపు దిప్పిన రచనలు. ఫ్రెడరిక్ ఎంగెల్స్ (1820–1895) మార్క్సు సహయోధుడు. సహ రచయిత, మిత్రుడు.

"అచ్చగా దానికే అయితే అంత ఫరవాలేదు. నేను ముందు నిలబడ్డానంటే సర్వవ్యాప్త సమ్మెకు తక్కువ జరగటానికి వీల్లేదు. అన్నీ ఆలోచించే సమ్మె పూనేశాను. కార్మిక ప్రతినిధులతో ప్రొద్దున ఆ మాటే చెప్పాను."

"అట్లాకాదు. ఈ సమ్మె జరిగే తీరాలి" అన్నారు యజమానుల ప్రతినిధులు.

"ఎందువల్లా?"

"కొల్లాయి గుడ్డలు బేళ్ళకు బేళ్లు పడి ఉన్నాయి. దిక్కుమాలిన ప్రభుత్వం మిల్లులు మూయనివ్వదు. కొల్లాయి గుడ్డల ధరలు ఎంత పడాలో అంతా పడి పోయాయి. అంతర్జాతీయ అశాంతిచేత ఎగుమతులు సన్నగిల్లాయి. యజమానులు తమ రక్తం పిండి, కార్మికులకు జీతాలిస్తున్నారు. కార్మికులకు యజమానులు గార్డియనులని గాంధీజీ చెప్పాడు. కాని యజమానులు నానా అగచాట్లూ పడుతున్నారు. రెండు నెల్లపాటు సమ్మె నడిచిందో యజమానులు బ్రతికి బయట పడతారు."

"రెండు నెలలే? కార్మికులెట్లా తట్టుకుంటారు? వాళ్ళకు మళ్ళీ నెల జీతాలు వచ్చే రోజు దాకా తట్టుకుంటారేమో. వాళ్ళ వేడి చల్లారకుండా ఏమిటి చెయ్యటం?"

"అది నీ చేతిలో ఉన్నది. నువ్వు బహిరంగ సభలూ అవీ చేయించు. 144 వ సెక్షను పెట్టటానికి ప్రభుత్వం ఉన్నది. పై పని పోలీసులు చూస్తారు."

"సమ్మెవల్ల యజమానులకు లాభమని పత్రికలవాళ్లు బయట పెడితే?"

"పత్రికలను మేం చూసుకుంటాం."

"సమ్మె ఖర్చులు?"

చెక్ పుస్తకం బయటికొచ్చింది. అయిదంకెల మొత్తం పడింది. కార్మిక నాయకుడు నిర్లక్ష్యంగా చెక్కు మడిచి జేబులో పెట్టుకుంటూ పార్టీ నిధికి?" అన్నాడు. ఇంకొక చెక్కు చేతులు మారింది.

"నా సొంత ఖర్చులకు?"

నోట్లకట్ట ఒకటి చేతులు మారింది.

యజమానుల మనుషుల మొహాలు వికసించాయి. వాళ్ళు కార్మిక నాయకుణ్ని అభినందించి, అతని దేశభక్తిని కొనియాడి, శలవు పుచ్చుకున్నారు.

కొల్లాయి కార్మికుల యూనియన్ భవనంలో సభ జరిగింది. ప్రధాన కార్మిక ప్రతినిధులు ముగ్గురే ఉన్నారు.

కార్మిక నాయకుడు చెప్పాడు.

"యజమానుల మనుష్యులతో మాట్లాడాను. వాళ్ళు నయాన బోనస్ ఇవ్వరు. సేట్ మాకీచూస్ అంటే నాకు ఆతిధ్యమిస్తున్న దేశభక్తుడు - కూడా చెప్పిచూశాడు. కార్మికులు సమ్మె చేసే స్థితిలో లేరనీ, వాళ్ళకు సమ్మె సాగించే దీక్షా, ఐకమత్యమూ లేవనీ యజమానులు బహిరంగంగా అంటున్నారు. కార్మికుల తడాఖా యజమాను

లకు చూపవలసిన సమయం వచ్చిందని నా అనుమానం. అయినా సమ్మె నిర్ణయం చేయవలసినవారు మీరు. మీ నిర్ణయాన్ని నేను అమలు జరపగలవాణ్ణి మాత్రమే."

కార్మిక ప్రతినిధులన్నారు.

"యజమానులు బోనస్ ఎగగొట్టే పక్షాన సమ్మె జరగవలసిందే."

"ముందే చెబుతున్నాను. నేను సమ్మె నడిపితే అది సమగ్రంగా చివరల్లా జరగాలి. కార్మికులలో ఐకమత్యం ఉండేటట్టు చూసే బాధ్యత మీది. వారు కష్టాలకూ, పోలీసుల దెబ్బలకూ తట్టుకునేటట్టు చూసే బాధ్యత కూడా మీదే. ఇది చాలా పెద్దవిషయం. కార్మిక ప్రతిఘటన చరిత్రలో శిలాక్షరాలతో లిఖించబడే సమ్మె. కనీసం మూడు నెలలైనా సమ్మె జరపటానికి మీరు సిద్ధంగా ఉండాలి మరి?"

కార్మిక ప్రతినిధులకు వేడెక్కింది. వాళ్ళడిగారు—

"మా యూనియనులు సిద్ధమే. మీ నాయకత్వం కింద ఉన్న ఇతర యూనియనులు సానుభూతి సమ్మెలు జరిపేలా చూస్తారా?"

"అదంతా నాకు వదలండి."

"కొల్లాయి కార్మికులలో కొందరు మన విరోధుల నాయకత్వం కింద ఉన్నారు. వాళ్ళు సమ్మెలో చేరక సమ్మె భగ్నం చేస్తారేమో?"

"వాళ్ళెంతమందిలే, మనం సర్వవ్యాప్త సమ్మె ప్రారంభించగానే వాళ్లు తప్పక సమ్మె చేస్తారు, సందేహంలేదు."

కార్మికుల జీతాలుముట్టిన మర్నాడే సమ్మె ప్రారంభమైంది. మర్నాటికల్లా సమ్మెలో చేరినవారి సంఖ్య మూడింతలయింది. సమ్మె జరిగిన నాలుగోరోజున కొల్లాయి గుడ్డల మిల్లులన్నీ దాదాపు మూలబడ్డాయి. నగరమంతటా సానుభూతి సమ్మెలు జరిగాయి. పత్రికలు సమ్మెకు ప్రాముఖ్యం ఇచ్చాయి. సమ్మెవల్ల రోజుకు ఎన్నివందల కొల్లాయి గుడ్డల ఉత్పత్తి నిలిచి పోతున్నదీ, ఫ్యాక్టరీలకు రోజూ ఎన్ని వేలు నష్టం వస్తున్నదీ అంచనా లివ్వబడ్డాయి.

నగరంలో 144 వ సెక్షను అమలు జరిగింది. కార్మిక నాయకుడు బ్రహ్మాండమైన ఊరేగింపులూ, బహిరంగ సభలూ జరిపాడు. కార్మికులు ప్రశాంతంగా ఉన్నంతవరకూ 144 వ సెక్షను నిద్రపోయింది. కార్మిక నాయకుణ్ణి ఎవరూ అరెస్టు చేయలేదు.

రానురాను కార్మికులకు వేడెక్కింది. కొందరు ఊరేగింపులతో బాటు విధ్వంసక చర్యలు ప్రారంభించారు.

సమ్మె ప్రారంభమై ఇరవై రోజులై, పత్రికల్లో ప్రకటిస్తున్నంత నష్టం వస్తున్నప్పటికీ, యజమానులు రాజీ బేరాలకు ఎందుకు రారో కార్మిక ప్రతినిధులకు అర్థంకాలేదు.

కార్మికులు విధ్వంసక చర్యలు చేస్తున్నారని ప్రభుత్వం పోలీసులను ప్రయో

గించారు. పోలీసులు తుపాకులు పేల్చారు. తుపాకులు కార్మికులను పేల్చాయి. కొందరు కార్మికులు చచ్చారు.

"సమ్మెకు కొత్తబలం వచ్చింది" అన్నాడు కార్మిక నాయకుడు.

* * *

యజమానుల పరిస్థితి చక్కబడింది. సమ్మె మూలంగా కార్మికుల కివ్వవలసిన జీతాలు అనేక లక్షలు ఆదా అయింది. నిలవ ఉన్న సరుకు మంచి ధరలకు చేయివదిలింది.

సేట్ మాకీ చూస్ భవనంలో కార్మిక ప్రతినిధులూ, యజమానుల ప్రతినిధులూ కూడా కార్మిక నాయకుణ్ణి కలుసుకున్నారు.

"ఎందుకొచ్చిన సమ్మె? ఇప్పటికైనా కార్మికులు పనిలోనికివస్తే తీసుకుంటాం. పరిష్కార సంఘంవాళ్ళు సిఫార్సు చేసిన బోనసు ఇవ్వలేం. ఇస్తామన్న నెల రోజుల జీతం ఎట్లాగు ఇస్తాం. ఎవరిమీదా ఎట్టి చర్యా తీసుకోం. చచ్చిన కార్మికుల్ని బ్రతికించలేంగాని, అరెస్టయిన కార్మికుల్ని విడిపించమని ప్రభుత్వాన్ని వేడుకుంటాం" అన్నారు యజమానుల ప్రతినిధులు.

"సమ్మె చేసిన రోజుల్లో మా జీతాల మాటేమిటి?" అన్నారు కార్మిక ప్రతినిధులు.

"అది మా వల్ల కాదు."

కార్మిక ప్రతినిధులు కార్మిక నాయకుడివంక చూశారు.

ప్రస్తుత అంతర్జాతీయ దుస్థితినిబట్టి సమ్మె ఆపటం మంచిదని నాకు గాంధీయం చెబుతోంది. కార్మికులు నష్టపడ్డారు. నే నెరుగుదును. కాని యజమానులకు అంతులేని నష్టం కలిగింది. సమ్మె విజయవంతమయింది. కార్మిక నాయకులు రాజీకి వస్తున్నారు. కార్మికులు నైతిక విజయంతో తృప్తి చెందటం ధర్మం. లొంగిన వాళ్ళను కుంగదీయడం అహింసా విధానం కాదు.

కార్మిక ప్రతినిధులు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. తమ నాయకుడి సలహా శిరసావహించారు.

"సరి అయిన తరుణంలో కార్మికులకు సరి అయిన సలహా" ఇచ్చినందుకు పత్రికలు కార్మిక నాయకుణ్ని ప్రశంసించాయి.

తరువాత రెండు మూడు రోజులకు కార్మిక నాయకుడు మరో నగరం వెళ్ళినట్టు పత్రికల్లో పడింది. కాని ఆయనకు స్టేషను వద్ద కార్మికులు వీడ్కోలిచ్చినట్టు పడలేదు.

—ముద్రణ : జనవరి 1955, ఆడజన్మ కథల సంపుటి
దేశికవితా మండలి, విజయవాడ